# ఫార్మాను ప్రభుత్వం అడ్డుకుంటోంది

- కాలుష్యం లేని ఫార్మాసిటీని నిర్మించాలని కేసీఆర్ కృషి చేశారు
- కేటీఆర్ కృషితోనే తుక్కుగూడ ప్రాంతంలో 52 కంపెనీల ఏర్పాటు
- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి చిత్రంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు

బడంగ్‌పేట, డిసెంబర్ 17: కేసీఆర్ ప్రభుత్వం కాలుష్యం లేని ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీకి అడ్డుకట్ట వేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఫార్మాసిటీ పనులు కొంత మేరకు పూర్తయ్యాయని, అన్ని రకాల చర్యలు తీసుకొని ఎవరికి ఇబ్బంది కలుగకుండా నిర్మాణం చేయాలని కేసీఆర్ కృషి చేశారన్నారు. ఎలాంటి కాలుష్యం రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారని, ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే చేశామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఎంప్లాయ్‌మెంట్ పెంచడానికి, ఫాక్స్‌ఖాన్ కంపెనీతో పాటు 52 కంపెనీలు తీసుకువచ్చారని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్లు, పైపులైన్ పనులు, ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయిస్తామన్నారు. రావలసిన నిధులు తప్పకుండా తీసుకొస్తామని, అభివృద్ధికి పెద్ద పీట వేస్తామన్నారు. ప్రతి కాలనీకి వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. తన గెలుపు కోసం పని చేసిన ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు శోభా ఆనంద్ రెడ్డి, యాతం పవన్ కుమార్ యాదవ్, అర్జున్, రాంరెడ్డి, శివకుమార్, స్వప్న వెంకట్ రెడ్డి, దీపిక శేఖర్ రెడ్డి, లలిత కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, స్వప్న జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నగాని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు అప్‌గ్రేడేషన్‌తో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతులు కల్పించడంతోపాటు విద్యార్హతలు ఉన్న వారికి జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. నూతనంగా వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని కోరారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కట్ట శ్రీనివాస్, విక్రమ్, సక్రూనాయక్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

## కళా రంగానికి చేయూత



సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కళా రంగానికి చేయూతనిస్తూ, సాహితీ సాంస్కృతిక వికాసానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ సాంస్కృతిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం అత్తాపూర్‌లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొని ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీశ్ చంద్ర మాట్లాడుతూ... తెలంగాణ కళలకు నిలయమన్నారు. 30 ఏండ్లుగా ఆకృతి ఆధ్వర్యంలో ఎన్నో విలక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆకృతి అధ్యక్షుడు సుధాకర్ మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ రామారావు, భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉమెన్ ఎంపవర్‌మెంట్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నటీ మాధవి, కిశోరి, రచయిత శ్రీనివాసరావు తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 17: మహిళా సాధికారతే లక్ష్యంగా.. రచయిత కొత్తపల్లి శ్రీనివాస రావు రచించిన 'ఉమెన్ ఎంపవర్‌మెంట్' పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్య అతిథిగా హాజరైన నటీ మాధవి, తల్లి కొత్తపల్లి కిశోరితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రమాదేవి, డాక్టర్ మంజుల జోషి,జె.రాజ్యలక్ష్మి, ఎన్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడిగా జీసీఎస్.శర్మ

బంజారాహిల్స్, డిసెంబర్ 17: ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్ అండ్ కంట్రోల్ అసోసియేషన్ (ఇసాకా) హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడిగా నగరానికి చెందిన జీసీఎస్ శర్మ ఎన్నికయ్యారు. సైబర్ సెక్యూరిటీ, రిస్ట్ మేనేజ్‌మెంట్, ఆడిటింగ్, ఐటీ గవర్నింగ్, సాఫ్ట్‌వేర్ నిపుణులతో కూడిన ఇసాకా హైదరాబాద్ చాప్టర్ సమావేశం ఆదివారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, ప్రొక్యూర్‌మెంట్ సంస్థల డైరెక్టర్ జీసీఎస్.శర్మను ఇసాకా హైదరాబాద్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇసాకా ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీతో పాటు సంబంధిత అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు, సరికొత్త ఆలోచనలను మార్పిడీ చేసుకునేలా సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తామని ఇసాకా అధ్యక్షుడు జీసీఎస్.శర్మ తెలిపారు.

## 23 నుంచి పీపుల్స్ ప్లాజాలో మ్యాన్‌కైండ్స్ పెట్‌స్టార్ వెట్ కార్నివాల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట్, డిసెంబర్ 17 : పెంపుడు జంతువుల ఔత్సాహికులకు ఈ నెల 23 నుంచి రెండు రోజుల పాటు నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో 'మ్యాన్‌కైండ్స్ పెట్‌స్టార్ వెట్ కార్నివాల్' జరుగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను తెలంగాణ కనైన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చీకోటి ప్రవీణ్, విశాల్ సుధామ్ ఆదివారం బేగంపేట్‌లోని ఫంక్షన్ ప్యాలెస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్నివాల్ కేవలం వినోదాన్ని పంచేందుకు మాత్రమే కాదని, బాధ్యతాయుతమైన పెంపుడు జంతువుల నిర్వహణ పట్ల జంతు ప్రేమికుల్లో అవగాహన పెంచుతుందన్నారు. కుక్క, పిల్లి, పక్షి, చేపలు, గుర్రం, ఎద్దు, దున్నపోతు, ఒంటె డ్యాన్స్, అన్యదేశ జంతు ప్రదర్శనలు ఈ కార్నివాల్‌లో హైలెట్‌గా నిలిచే సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. దీంతో పాటు జంతువులకు కాస్ట్యూమ్ పోటీకి, చురుకుదనం, విధేయత ప్రదర్శనలు, పెట్ అడాప్షన్ డ్రైవ్, పెట్ ఉత్పత్తులు మరియు సేవలతో విక్రేత స్టాల్స్, పెంపుడు జంతువుల ఆరోగ్యంపై విద్యా సెషన్లు ఉంటాయని, మరిన్ని వివరాలకు telanganacanineassociation<@>gmail.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని వారు కోరారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..




నల్గొండకు చెందిన సురేశ్ గుప్తా పర్యావరణంపై తనకున్న అభిమానంతో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ పరిధిలో ఆదివారం ప్రజల్లో చైతన్యం కల్పిస్తుండగా 'నమస్తే తెలంగాణ' కంట పడ్డారు. నగరంలో ఎక్కడ ఏ కార్యక్రమమైనా పర్యావరణ పోస్టర్‌ను ప్రదర్శించి ప్రజలను చైతన్యం చేస్తున్నాడు.

## ఐసీబీఎం బిజినెస్ స్కూలులో..

*నగరంలోని ఐసీబీఎం బిజినెస్ స్కూలులో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థినులు సందడి చేశారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థినులతో సెల్ఫీలు దిగి ఆనందంగా గడిపారు.*



## పన్ను బకాయిదారులకు.. రెడ్ నోటీసులు

- 30 సర్కిళ్లలో పన్ను చెల్లించని వారిని గుర్తించి చర్యలు
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఆస్తి పన్ను బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. 30 సర్కిళ్లలో బకాయిదారుల చిట్టాను సిద్ధం చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. రోజురోజుకు సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుండటం, ఈ ఆర్థిక సంవత్సరం రూ.2100 కోట్ల నిర్దేశిత లక్ష్యానికిగాను.. ఇప్పటి వరకు కేవలం రూ.1200 కోట్ల మేర పన్నులు రావడంతో బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. మొదటి విడతలో ప్రభుత్వ శాఖలకు లేఖలు రాయడం, పెద్ద మొత్తంలో బకాయి పడిన ఆస్తుల యాజమానుల జాబితాలను సిద్ధం చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలో 300 డాకెట్లలో 13 లక్షల మంది పన్ను చెల్లింపుదారులలో బడా బకాయిదారుడికి రెడ్ నోటీసులు అందజేసి, 15 రోజుల్లోగా స్పందించని యాజమాని ఆస్తులను స్వాధీనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### రాబోయే మూడు నెలల్లో రూ.900 కోట్ల లక్ష్యం

నిర్దేశిత లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం తగదని, వీక్లీ టార్గెట్స్ కాకుండా డైలీ టార్గెట్‌గా పెట్టుకొని ఆస్తిపన్నును వసూలు చేయాలని అధికారులకు కమిషనర్ రొనాల్డ్‌రాస్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రాబోయే మూడు నెలల పాటు రూ.900 కోట్ల మేర లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉండటంతో ఆస్తిపన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులకు స్పందించకుంటే సంబంధిత షాపులను సీజ్ చేయడం లాంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.